# సూర్య

www.suryaa.com

## రంగారెడ్డి - వికారాబాద్

గురువారం 11 ఏప్రిల్ 2024 | పేజీలు : 8


## త్రాగునీటి సరఫరాకు అన్ని రకాల చర్యలు



### జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (ఏప్రిల్ 10) ః త్రాగు నీటి సరఫరాకు అన్ని రకాల చర్యలు తీసుకున్నట్టు వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి త్రాగునీటి సరఫరాపై ప్రణాళిక, వరి ధాన్యం కొనుగోలు, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిం చడం జరిగిందని తెలిపారు. ప్రతి గ్రామానికి త్రాగునీటి సరఫరా కార్యచరణ రూపకల్పన చేసినట్టు ఆయన తెలిపారు. వడదెబ్బ తగిలిన వారికి అవసరమైన ప్రథమ చికిత్స సత్వరమే అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆశా వర్కర్ల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో వుంచడం జరిగిందని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ , లింగ్యా నాయక్ అసిస్టెంట్ కలెక్టర్ నారాయణ అమిత్, డిపిఓ జయసుధ, డీఈఓ రేణుక దేవి, డిఆర్డిఓ శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుగుణ బాయి, డీఎంహెచ్ఓ పల్వాన్ కుమార్, మిషన్ భగీరథ ఇఇ లు బాబు శ్రీనివాస్, చల్మా రెడ్డి, డిఇలు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన అడిషనల్ డీసీపీ




ఆమనగల్లు, మేజర్‌న్యూస్ (ఏప్రిల్ 10) : ఆమనగల్లు పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని శంషాబాద్ జోన్ అడిషనల్ డీసీపీ రామ్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన పాత కేసు వివరాలను ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది పనితీరు వారికి కావాల్సిన సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సిఐ, ఎస్ఐకి సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పాత నేరస్తులు, రౌడీ షీటర్లపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని ఆదేశించారు. ఆయన వెంట సీఐ బీ. ప్రమోద్ కుమార్, ఎస్సై కే.బలరాం ఉన్నారు.

### రంజిత్‌రెడ్డిని గెలిపిస్తే...

## ఆరు గ్యారంటీ పక్కా

- ఎంపీ రంజిత్ రెడ్డి సతీమణి గడ్డం సీతారెడ్డి వ్యాఖ్య
- శంషాబాద్ మండలం నర్ఖూడ, చౌదరిగూడ గ్రామాల్లో గడప గడప ప్రచారం



శంషాబాద్, మేజర్‌న్యూస్ (ఏప్రిల్ 10) : చేవెళ్ళ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి, తాజా మాజీ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డిని మళ్లోసారి చేవెళ్ల ఎంపీగా భారీ మెజారిటీతో గెలిపిస్తే అర్హులున్న ప్రతి ఇంటికి ఆరు గ్యారంటీలు తీసుకొని వస్తారని ఆయన సతీమణి, టీటీడీ బోర్డు మెంబర్ గడ్డం సీతారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నాడు ఆమె శంషాబాద్ మండల పరిధిలోని నర్ఖూడ, చౌదరిగూడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. తొలుత ఆమె న ర్ఖూడ లోని అమ్మపల్లి ఆలయంలోని సీతారామ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం నర్ఖూడ, చౌదరిగూడ గ్రామాల్లో గడప గడపకూ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథ కాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మీడి యాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా లబ్దిదారులకు ప్రతి నెల రూ. 2500 ఆర్థిక భరోసా ఉంటుందని, రూ. 500/- లకే గ్యాస్ సిలిండర్‌తో పాటు ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్నట్టు వివరిం చారు. రైతు భరోసా, చేయూత, యువ వికాస్ వంటి పథకాలతో ప్రజలకు లబ్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ప్రచార కార్యక్రమంలో సీతారెడ్డి వెంట తెలంగాణ రాష్ట్ర పాడిపరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్రా జ్ఞానే శ్వర్, నర్ఖూడ ఎంపీటీసీ గౌతమి పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిన పలువురు బీజేపీ నాయకులు**

ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో కాంగ్రెస్ పార్టీలోకి వివిధ పార్టీల నాయకులు చేరికలు భారీగా నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి నేతృత్వంలో శంషాబాద్ బీజేవైఎం నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని లక్ష్మీగూడ, మల్కారం గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున బుధవారం నాడు రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి కస్తూరి నరేందర్ ఆధ్వర్యంలో, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొని పార్టీలో చేరారు.



కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న శంషాబాద్ బీజేపీ నాయకులు

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి




- టిఆర్ఎస్ మాజీ మంత్రి కేటీఆర్
- కాంగ్రెస్‌కు ఓటు వేసి మళ్లీ మోసపోవద్దు
- మాజీమంత్రి మల్లారెడ్డి

మేడిపల్లి, మేజర్‌న్యూస్ (ఏప్రిల్ 10) ః కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. ఈ మేరకు బుధవారం పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని ఎం కె బి ఆర్ ఫంక్షన్ హాల్ లో మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి సభఅధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ అర చేతిలో వైకుంఠం చూపించి అడ్డగోలు హామీలనిచ్చి గద్దెనెక్కిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. రాష్ట్రంలో అధికారం కోసం కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు నెరవేర్చకుంటే వెంటాడుతం, వేటాడుతం, ప్రజలందరినీ కూడగట్టి రాజకీయంగా బొందపెడతామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి గుంపు మే గా, ప్రధానమంత్రి తాపీ మే లాగా వ్యవహరిస్తూ తెలంగాణ కలను సమాది కట్టాలని చూస్తున్నారని, తెలంగాణ గొంతులుండొద్దు, కేసీఆర్, బీఆర్ఎస్ ఉండొద్దు, కేసీఆర్ ను బొంద పెట్టాలె.. మనమిద్దరమే ఉండాలనే తాపత్రయంతో కేసులు పెట్టుడు వంటి కుట్రలు కుతంత్రాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జీవితంలో ఎత్తుపల్లాలు సహజమని,రాజకీయాల్లో గెలుపు, ఓటములు కూడా ఉంటాయని, ఓడామని కుంగిపోవడం, గెలిచామని పొంగిపోయేది లేదన్నారు. ప్రజలు తమ వైపే ఉన్నారన్నారు. పదేళ్ళు

మిగతా 2లో

## ఉత్సాహంగా 2కె రన్



- ప్రతి ఓటరు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్
- బుల్లెట్ కన్నా బ్యాలెట్ గొప్పదని వ్యాఖ్య
- మే 13న ప్రతి ఓటరు ఓటింగ్‌లో పాల్గొనాలి
- హైదరాబాద్ ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

2 లో

# తాగునీటికి ఇబ్బంది రాకుండా చూడాలి



- ఎక్కడైనా సమస్య ఏర్పడితే సత్వరమే పరిష్కరించాలి
- కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సూచన



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (ఏప్రిల్ 10) : తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, ఒకవేళ ఎక్కడైనా సమస్య తలెత్తితే సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి సూచించారు. ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి వేసవిలో తాగునీటి సరఫరా ప్రణాళిక, ధాన్యం కొనుగోలు, పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన, వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వేసవికాలం ముగిసి, వర్షాలు వచ్చే వరకు తాగునీటి సరఫరాను అనునిత్యం నిశితంగా పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో తాగు నీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులను ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని అన్నారు. వార్తా పత్రికలలో, ఎలక్ట్రానిక్ మీడియాలో తాగునీటి సరఫరాకు సంబంధించి జిల్లాలో రూపొందించుకున్న ప్రణాళిక , నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు, వాటిని పరిష్కరించేందుకు తీసుకుంటున్న చర్యలు, నీటి పునరుద్ధరణ వివరాలు తెలియజేయాలని అన్నారు. తాగు నీటికి సంబంధించి ప్రజలు ఎక్కడ కూడా ఆందోళనలు చేయాల్సిన అవసరం లేకుండా చూసుకోవాలని సీఎస్ తెలిపారు. ప్రతి జిల్లాలో తాగునీటి సరఫరాకు సంబంధించి సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, క్షేత్ర స్థాయిలో వచ్చే ఇబ్బందులను పరిష్కరించేందుకు అవసరమైన బృందాలను ఏర్పాటు చేయాలని, తాగునీటి సరఫరాకు సంబంధించి క్షేత్రస్థాయి నుంచి క్రమం తప్పకుండా సమాచారం సేకరించాలని అన్నారు. పట్టణాలలో ఏర్పడిన నూతన కాలనీలు, చివరి ఆవాస ప్రాంతాలు తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని, పట్టణాలలో, గ్రామాలలో తాగునీటి సరఫరా ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని సిఎస్ సూచించారు. రానున్న రెండు నెలల పాటు క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను సత్వరం పరిష్కారం అయ్యే విధంగా చూడాలని, తాగునీటి సరఫరాను ప్రతిరోజు పర్యవేక్షించాలని తెలిపారు. వానాకాలం 2023-24 కు సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరీ వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని, భారత ఆహార సంస్థ నిర్దేశించిన సమయానికి రైస్ డెలివరీ చేసే విధంగా ప్రతి జిల్లాలో రైస్ మిల్లుల పనితీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని, ప్రతిరోజు రైస్ మిల్లులు పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిచేలా చూడాలని, సిఎంఆర్ రా రైస్ డెలివరీ పై కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుందని సిఎస్ సూచించారు.యాసంగి ధాన్యం కొనుగోలు అంశాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు మద్దతు ధర పై పూర్తి స్థాయిలో కొనుగోలు చేయడం జరుగుతుందని, ధాన్యం కొనుగోలు అంశంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే త్వరితగతిన సంబంధిత రైతుకు చెల్లింపులు జరిగేలా చూడాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలకు కనీస మౌలిక సదుపాయాల కల్పన పనులు సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. తాగునీటి సౌకర్యం, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను ఉపయోగంలోకి తీసుకుని రావడం, అదనపు టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదుల మైనర్, మేజర్ మరమ్మత్తులు తరగతి గదులకు విద్యుత్ సౌకర్యం కల్పన వంటి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. పాఠశాలలో మౌలిక వస్తువుల కల్పనకు ప్రతి మండలంలో పనుల పర్యవేక్షణకు ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ నియమించాలని, పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి పాఠశాలలో అవసరమైన పనులు పాఠశాలలు ప్రారంభం అయ్యే లోపు పూర్తి చేయాలని సీఎస్ సూచించారు. వడదెబ్బ తగిలిన వారికి అవసరమైన ప్రథమ చికిత్స సత్వరమే అందేలా చూడాలని, క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని, ఉపాధి హామీ పనులను ఉదయం పూట నిర్వహించాలని, ఉపాధి హామీ పనుల నిర్వహణ సమయంలో కార్మికులకు అవసరమైన మేరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని అన్నారు.

వడ గాల్పులు వీస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని, అత్యవసరం ఉంటేనే ప్రజలు బయటకు రావాలని, బయటకు వస్తే అవసరమైన జాగ్రత్తలు పాటించాలని, వడ గాల్పులు గురైన వ్యక్తులను వెంటనే అవసరమైన ప్రథమ చికిత్స చేసి సమీప ఆసుపత్రికి తీసుకుని వెళ్లాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్, భూపాల్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు, డీపీఓ సురేష్ మెహన్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**మొదటిపేజీ తరువాయి...** అధికారమిచ్చిన ప్రజలు ప్రధాన ప్రతిపక్షంగా కొట్లాడమని తీర్పు ఇచ్చారన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ తాగు, సాగు నీరు, నిరంతర కరెంటు సరఫరా, జిల్లాకో మెడికల్ కాలేజీలతో అభివృద్ధి పథంలో పయనింపజేశారన్నారు. రైతుల రుణ మాఫీ, మహాలక్ష్మి పథకం అమలు ఇంకెన్నడని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. హామీ గురించి అడిగితే రేవంత్ రెడ్డి మెడల పేగులేసుకుంటా జేబుల కత్తెర పెట్టుకుని తిరుగుతున్న. మానవ బాంబునైత అంటూ పొంతనలేని సీఎం స్థాయిని దిగజార్చే మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవ బాంబువయ్యే కర్మ నీకు అవసరం లేదని, నీ పక్కనే నల్గొండ బాంబు, ఖమ్మం బాంబు ఉన్నాయని చురకలంటించారు.రాష్ట్ర సంపద పెంచే తెలివి లేదు గానీ, ఈ స్కామ్.. ఆ స్కామ్ అంటున్నారని.. ఫోన్ల ట్యాపింగ్ పై పెట్టిన శ్రద్ధ వాటర్ ట్యాంకర్లపై పెట్టాలని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి అభ్యర్థిని సునీత రెడ్డి ఎంపిక బీజేపీకి లాభం చేకూర్చేందుకే డమ్మీ క్యాండెట్లను నిలబెడుతున్నారని అన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపి కలిసి పని చేస్తున్నాయని లోపాయికారి ఒప్పందం చేసుకుని కేసీఆర్ ను బీఆర్ఎస్ ను ఉండనియ్యొద్దనే కుంతంత్రాలు చేస్తున్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ కు ఒక్క సీటు రాదని రేవంత్ రెడ్డి చెప్పడం పట్ల కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ.... దమ్ముంటే మల్కాజిగిరి స్థానం నుండి ఇద్దరం పోటీ చేద్దామని మరోసారి సవాల్ విసిరారు. పార్లమెంట్ ఎన్నిక తరువాత 30 మంది ఎమ్మెల్యేలను తీసుకుని బీజేపీలోకి జంపయ్యే నాయకుడు రేవంత్ రెడ్డి కాబోతున్నారని జోస్యం చెప్పారు. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీని సైతం రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని విమర్శించారు. చౌకీధార్ చోర్ హై అని రాహుల్ అంటుంటే.. చౌకీధార్ బడే బాయ్ అంటున్నాడని.. ఆధానీ ఫ్రాడ్ అని రాహుల్ అంటే! ఆధానీ ఫ్రెండ్ అని రేవంత్ సంభోదిస్తున్నారని ఎద్దేవా చేశారు. మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల ఇక్కడ కూడా ఓటమి పాలవడంతో హుజురాబాద్ పారిపోవుడు ఖాయమన్నారు. తెలంగాణకు బీజేపీ ఏంచేసిందని ఓటు వేయాలని ప్రశ్నించారు. బీజేపీ పదేళ్ళ పాలనలో రాష్ట్రానికి ఇచ్చింది, తెచ్చింది ఏమీ లేదని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మా రెడ్డి పకా లోకల్ అని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేది గులాభి జెండాయేనన్నారు. పార్లమెంట్ లో తెలంగాణ వాణి వినపడాలంటే బీఆర్ఎస్ ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

మాజీ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ....

.కాంగ్రెస్ కు ఓటు వేసి మళ్ళీ మోసపోవద్దని మాజీ మంత్రి మల్లారెడ్డి అన్నారు.మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో రాగిడి లక్ష్మారెడ్డికి భారీ మెజారిటీ ఖాయంమని,20 ఏళ్లుగా ప్రజా సేవలో ఉన్న వ్యక్తి రాగిడి..బి.ఆర్.ఎస్. ను రెండు జాతీయ పార్టీలు కలిసినా ఏమి చేయలేవని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత మోసం చేస్తుందని ప్రజలు ఊహించలేదు. నాలుగు నెలల్లోనే ప్రజలకు నరకం చూపిస్తున్నారని,తెలంగాణా అభివృద్ధి పథకాలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ చేసింది.కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ కూడా తెలంగాణా ప్రజలకు చేసిందేమీ లేదని,ప్రజలందరూ బి.ఆర్.ఎస్. కు ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ...

హుజురాబాద్ లో చెల్లని రూపాయి మల్కాజిగిరిలో ఎలా చెల్లుతుంది..20 ఏళ్ళు ఎమ్మెల్యేగా ఉండి హుజురాబాద్ ను అభివృద్ధి చేసింది లేదని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేసీఆర్ ను కేటీఆర్ ని ఏమి చేయలేక ,బీజేపీ తో కుమ్మక్కై కావాలనే మల్కాజిగిరి లో కాంగ్రెస్ నుండి డమ్మీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని నిలబెట్టారని ఎద్దేవా చేశారు. బి.ఆర్.ఎస్. కార్యకర్తలు అందరూ ధైర్యంగా ఉండి పార్లమెంట్ ఎన్నికల కోసం కష్టపడి .మల్కాజిగిరి లో రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు.

మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ...

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ పీర్జాదిగూడ నగరానికి ఎన్నో ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేశారని మల్కాజ్గిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా నిలిచి భారీ మెజారిటితో గెలిపించి కేసీఆర్ కు బహుమతి ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థి రాగిడి లక్ష్మా రెడ్డి,చామకూర భద్రారెడ్డి,పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి,బోడుప్పల్ మేయర్ సామల బుచ్చి రెడ్డి, బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవి గౌడ్, బోడుప్పల్ భారాసా అధ్యక్షుడు మంద సంజీవ రెడ్డి,జంట కార్పొరేషన్ల పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా 2కె రన్

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (ఏప్రిల్ 10) : ఓటును మించిన ఆయుధం లేదని, ప్రతి ఓటరు తమ ఓటు హక్కును ఉపయోగించుకోవా లని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం శేర్లింగంపల్లి జోన్ కొండాపూర్ బొటానికల్ గార్డెన్స్ నుండి హైటెక్స్ రోడ్ మెటల్ చార్మినార్ వరకు 'ఐ ఓట్ ఫర్ షూర్' అనే నినాదంతో నిర్వహించిన 2కె రన్ ఉత్సాహంగా సాగింది. వివిధ వర్గాల వారు స్వచ్ఛందంగా 2కె రన్‌లో పాల్గొని ప్రజాస్వామ్య పరిణతి చాటారు. అధికారులు, ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్ జెండర్లు, యువత, దివ్యాంగులు, వాకర్స్ అసోసియేషన్స్, సైకిలిస్ట్ అసోసియేషన్స్, పోలీసులు, విద్యార్థిని విద్యార్థులు, పెద్ద ఎత్తున 2కె రన్‌లో భాగస్వాములయ్యారు. కొండాపూర్ బొటానికల్ గార్డెన్స్ నుండి ప్రారంభమైన 2కె రన్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జెండా ఊపి ప్రారంభించారు. ఐ ఓట్ ఫర్ షూర్, ప్రకాశంవంతమైన దేశం కోసం ఓటు వేయాలి అనే నినాదాలు రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ వివిధ వర్గాల వారు పరుగులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థలో అతి కీలకమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, స్వేచ్ఛయుతంగా నైతిక ఓటింగ్ చేయాలని సూచించారు. రాష్ట్రంలో 3.30 కోట్ల ఓటర్లు ఉన్నారని, ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనట్లైతే ఓటు వృథా వుతుందన్నారు. 2 కె రన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ తమ ఇంట్లోవారిని,చుట్టుపక్కల వారిని తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా చైతన్యపరచాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ, బుల్లెట్ కన్నా బ్యాలెట్ పవర్ గొప్పదని, మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందన్నారు. హైదరాబాద్ నగరం అన్నింటా ముందున్నా, ఓటింగ్ శాతం లో 50శాతం మించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంతమైనప్పటికీ, అందరూ చదువుకున్న వాళ్ళు ఉన్నప్పటికీ, ఓటు వేయడంలో నిరాసక్తత చూపుతున్నారన్నారు. ఓటర్ జాబితాలో తమ పేరు ఉన్నది లేనిది చెక్ చేసుకోవాలని, లేనట్లయితే ఈ నెల 15 లోగా ఫారం -6లో దరఖాస్తు చేసుకుని ఓటు హక్కు పొందాలన్నారు. ఓటు హక్కు ఉన్న అందరూ మే 13న జరుగు పోలింగ్ ప్రక్రియలో పాల్గొని నిర్భయంగా స్వేచ్ఛగా ఓటు వేయాలని , అదేవిధంగా మిగతా వారిని చైతన్య పరచాలని కోరారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ, శేర్లింగంపల్లి పెద్ద నియోజక వర్గమని, ఏడు లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారని, ఆదాయం, చదువులో మాత్రమే కాదు, సామాజిక బాధ్యతలో కూడా ముందున్నామని నిరూపించు కోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామన్నారు. ఓటర్ హెల్ప్ లైన్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని, ఓటర్ సర్వీస్ పోర్టల్ లో ఓ టర్లు తమ వివరాలను చెక్ చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు వేసేలా ఇంటిలో, ఆఫీసులలో, బంధువులు, స్నేహితుల వద్ద ఓటు వేయడం పై మాట్లాడి అవగాహన కల్పించి అందరూ ఓటేసేలా చైతన్యం చేయాలని కోరారు. అనంతరం అందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. 2 కె రన్‌లో టాప్‌గా వచ్చిన ఐదుగురికి మెమొంటోలు అందజేసారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిభా సింగ్, శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్, ఏసిపి,ఆయా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి : తుమ్మలూరు మాక్ ప్రాజెక్ట్‌లోని సీనియర్ ఐపీఎస్ అధికారి, విజిలెన్స్ అండ్ ఎన్ఫో ర్స్మెంట్ డైరెక్టర్ జనరల్ రాజీవ్ రతన్ మంగళవారం ఉదయం తీవ్ర గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు, ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర డిజిపి రవి గుప్తా, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక రాజీవ్ రతన్ నివాసానికి చేరుకొని వారి పార్థీవ దేహం వద్ద పుష్ప గుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన పార్థీవ దేహాని జూబ్లీహిల్స్ మహాప్రస్తానము నకు తరలించి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

# ఘట్కేసర్ చైర్ పర్సన్‌పై వీగిన అవిశ్వాసం

## బల నిరూపణలో హాజరుకాని సభ్యులు



ఘట్కేసర్, మేజర్ న్యూస్(ఏప్రిల్, 10):ఘట్ కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ పై సొంత పార్టీకి చెందిన కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. గత నెల 16న బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ చైర్ పర్సన్ పావని జంగయ్య యాదవ్ పై ఆ పార్టీకి చెందిన 12 మంది కౌన్సిలర్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ కు అవిశ్వాసం నోటీసు అందజేశారు. ఘట్ కేసర్ మున్సిపల్ కార్యాలయంలో కీసర ఆర్డీవో శ్రీ వెంకట ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన అవిశ్వాస తీర్మాణంపై బుధవారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశంలో చైర్ పర్సన్ తో పాటు అవిశ్వాసం నోటీసు ఇచ్చిన వైస్ చైర్మన్ మాధవ రెడ్డి టీఆర్ఎస్ కౌన్సిలర్లు ఇతర పార్టీ కౌన్సిలర్లు హాజరు కాలేదు మధ్యాహ్నం ఒకటి గంటల వరకు కౌన్సిలర్లు ఒక్కరు కూడ హాజరు కాక పోవటంతో అవీశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి ప్రకటించారు. నివేదికను జిల్లా కలెక్టర్ కు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడ్డ ట్రాక్టర్

పద్దెముల్, మేజర్‌న్యూస్ (ఎప్రిల్ 10)ః అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ గిరి తెలిపారు. వివరాలలోకి వెళితే.. పెద్దేముల్ గ్రామ శివారులో తెలవారు జామున 02.45 గంటలకు ట్రాక్టర్ నెంః టిఎస్ 07 ఇపి 9004, ట్రాలీ నెంః ఎపి 28 ఏపి 9092 దానికి ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక లోడ్‌తో అక్రమంగా తరలించడంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని విచారిస్తే ట్రాక్టర్ డ్రైవర్ మంబాపూర్ గ్రామానికి చెందిన సంగెం రాములు. ట్రాక్టర్ యజమాని బోయిని మల్లప్పగా గుర్తించినట్లు తెలిపారు. ఇట్టి విషయమై కేసు నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

## రంజాన్ సందర్భంగా నిరుపేదలకు సరుకులు పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, కౌన్సిలర్ తదితరులు

కొడంగల్, మేజర్ న్యూస్ (ఏప్రిల్ 10): నెల రోజుల పాటు కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులు గురువారం రంజాన్ పండగను జరుపుకోనున్నారు. బుధవారం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు పాత కొడంగల్ గ్రామంలో నిరుపేద ముస్లింలకు రంజాన్ పండగ పర్వదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, కౌన్సిలర్ శంకర్‌నాయక్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు ఆసిఫ్‌ఖాన్ చేతుల మీదుగా సరుకులు పంపిణీ చేశారు.

## సూర్యప్రభ వాహనంపై శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం



సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనం ఇస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి

కొడంగల్, మేజర్ న్యూస్ (ఏప్రిల్ 10): కొడంగల్ శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి 44వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ వేంకటేశ్వరస్వామి సూర్యప్రభ వాహనంపై సూర్యనారాయణమూర్తిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఏడవ రోజు ఉదయం సూర్యప్రభ వాహనంపై ఆలయ మాడవీధుల్లో ఆలయ అర్చకులు భక్తులకు దర్శనం కల్పించారు. ఉత్సవాలకు కొడంగల్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి

### రాగిడి లక్ష్మారెడ్డిని సన్మానించిన కిన్నెర లక్ష్మీ శ్రీ జంగయ్యలు



లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న కిన్నెర లక్ష్మీ శ్రీ జంగయ్యలు.

ఘట్‌కేసర్ రూరల్, మేజర్‌న్యూస్(ఏప్రిల్ 10) : మేడిపల్లిలో జరిగిన ఉమ్మడి ఘట్‌కేసర్ మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని బుధవారం ఘట్‌కేసర్ మండలం కాచవాని సింగారం మాజీ వార్డు సభ్యురాలు కిన్నెర లక్ష్మీ శ్రీ, బీఆర్ఎస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు కిన్నెర జంగయ్యలు శాలువాతో సత్కరించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ లక్ష్మారెడ్డి గెలుపును ఎవరు అపలేరని, భారీ మెజార్టీతో గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముస్తాఫా, చుంచు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌కు ఘట్కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ పావని జంగయ్య యాదవ్ రాజీనామా



ఘట్కేసర్, మేజర్ న్యూస్(ఏప్రిల్, 10):ఘట్కేసర్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ బిఆర్ఎస్ పార్టీకి బుధవారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు పంపారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి, మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్ సహకారంతో బిఆర్ఎస్ కు చెందిన కౌన్సిలర్లు తనపై అవిశ్వాసం పెట్టినందుకు మనస్థాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు చైర్ పర్సన్ పావని జంగయ్య యాదవ్ తెలిపారు.

## నేడు రంజాన్ పండగ



కొడంగల్, మేజర్ న్యూస్ (ఏప్రిల్ 10): ముస్లిం సోదరులు పవిత్రంగా భావించే రంజాన్ మాసం ఉప వాస దీక్షలు బుధవారంతో ముగియడంతో రంజాన్ పండగను గురువారం జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా మైనారిటీ నాయకులు ఎస్‌ఎం.గౌసన్ మాట్లాడుతూ గురువారం ఉదయం 9 గంటలకు స్థానిక జామే మస్జీద్ నుంచి ముస్లిం సోదరులు ర్యాలీగా ఈద్గాకు చేరుకొని 9:30 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముస్లిం సోదరులు సమయానికి హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనాలని కోరారు.

## 200 యూనిట్ల లోపు బిల్లు వస్తే చెల్లించాల్సిన అవసరం లేదు

### ఏడిఈ శ్రీనివాస్ రెడ్డి



ఘట్కేసర్, మేజర్ న్యూస్(ఏప్రిల్, 10):గృహ జ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ దరఖాస్తుల డేటా ఎంట్రీలో తప్పిదాలను సరిచేసి అర్హులకు న్యాయం చేస్తామని ఏడిఈ బి. శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డు ఉండి ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న జీరో బిల్లులు రాకపోయినప్పటికీ కూడా 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తే బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆన్ లైన్ డేటా ఎంట్రీ లో పొరపాటు జరిగితే రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కరెంటు కనెక్షన్ వివరాలతో సంబంధిత విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ ని సంప్రదించాలని ఆయన సూచించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా డేటా ఎంట్రీ లో తప్పిదలను సరి చేసే వీలు లేదని ఎన్నికల అనంతరం మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారుల సమన్వయంతో సరి చేస్తామన్నారు.

## శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

- ప్రతి ఒక్కరూ సుభిక్షంగా ఉండాలి
- ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వెల్లడి



తాండూరు మేజర్ న్యూస్ (ఏప్రిల్ 10)ః తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి బుదవారం నాడు కుటుంబ సమేతంగా యాదాద్రిలోనీ శ్రీలక్ష్మి నరసింహ స్వామీ వారిని దర్శించుకున్నారు.ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తన సతీమణితొ కలిసి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారు ప్రతి ఒక్కరినీ సుభిక్షంగా పెట్టాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే దంపతులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

### కొడంగల్ మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి



పాడైన చేతి పంపులు మరమ్మతు చేయించాలని సూచిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్, మేజర్ న్యూస్ (ఏప్రిల్ 10):
వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కొడంగల్ మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో బుధవారం ఆయన పాడైన చేతి పంపులను పరిశీలించి మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు కాలనీల్లో అధికారులతో కలిసి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ మునీర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రసిడెంట్ దాము, మురారి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# వడ దెబ్బకు దూరంగా ఉందాం..



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (ఏప్రిల్ 10)ః జిల్లా లో తీవ్ర మౌతున్న ఎండలు,వేడి గాలుల కారణంగా ప్రజలు వడ దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని,అందుకు ప్రజలు వడదెబ్బ నివారణకు తగు జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేఖ్ అగస్త్య అన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ లోని విసిహాల్‌లో బుధవారం జాతీయ కార్యక్రమం వాతావరణ మార్పు మరియు మానవ ఆరోగ్యంపై అనే అంశం పై ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశానికి జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ రఘునాథ స్వామి తో కలిసి అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య హాజరైనారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు, నేరుగా సూర్య కిరణాలూ తాకే స్థలాలలో పని చేసే వారు వడదెబ్బ కు గురి కాకుండా ఉండేలా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వైద్య, విద్య, డిసాస్టర్ మానెజ్మెంట్ అథారిటీ, వ్యవసాయ, పశు సంవర్ధక, పబ్లిక్ వర్క్స్, పర్యావరణ, కాలుష్య నివారణ, మున్సిపల్ కమిషనర్ శాఖల వారు సమన్వయంతో పని చేయాలన్నారు. వడదెబ్బకు గురి కాకుండా ఉండేందుకు కూడళ్ల దగ్గర, పార్కుల వంటి స్థలాల వద్ద చలి వేంద్రాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసి త్రాగు నీటిని, చలి వేంద్రాలలో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. బయటికి వెళ్లే ప్రతి ఒక్కరు తలాపై టోపీ, టవల్ ధరించాలని, ఓఆర్ఎస్ పౌడర్ కలిపిన నీటిని వెంట తీసుకువెళ్లాలని తెలిపారు. ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను యూ పి హెచ్ సి, పి హెచ్ సి కేంద్రాలకు ఏ ఎన్ ఎం, ఆశ వర్కర్లతో పంపిణి చేయించాలన్నారు. వడదెబ్బ తగిలిన వారికీ శీతల పానీయాలు కాకుండా, మంచి నీళ్లు, ఓ ఆర్ ఎస్ కలిపిన నీళ్లు వెంటనే త్రాగించాలి, నీడ ఉండే ప్రదేశాలలో ఉండేలా చూడాల న్నారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఉండే ప్రదేశాలలో నీడ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముగాజీవాలకు, పక్షులకు మంచినీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అన్నారు.

**వడ దెబ్బ నుంచి రక్షించుకుందాంః అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య**

అనంతరం వడ దెబ్బ నుండి రక్షించుకుందాం అనే గోడ పత్రికను అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డి ఓ సాంబశివ రావు, డిఏఓ రేఖ, డిజిడబ్ల్యూఓ రేవతి, డి డబ్ల్యూ ఓ కృష్ణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.




వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

## జిల్లాలోని ముస్లిం సోదరులకు ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు

● జిల్లా ఎస్పీ నంద్యాల కోటి రెడ్డి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (ఎప్రిల్ 10)ః జిల్లాలోని ముస్లిం సహోదరులు వారి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఇట్టి పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు సంతోషం, శాంతి మరియి శ్రేయస్సు కలగాలని, జిల్లాలో ఎక్కడ కూడా ఎలాంటి అవంఛానీయమైన సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో పండుగను జరుపుకోవాలని తెలిపారు.

## వాహనాలపై గట్టి నిఘా : ఎస్ఐ స్రవంతి



వాహనాలను తనిఖీ చేస్తున్న కోట్పల్లి ఎస్సై స్రవంతి

కోట్‌పల్లి, మేజర్‌న్యూస్ (ఎప్రిల్ 10)ః ఎన్నికలవేళ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం కోటపల్లి ప్రధాన రహదారుల గుండా తనిఖీ చేయడం జరుగుతుందని ఎస్సై స్రవంతి తెలిపారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కోడ్ అమల్లో ఉందని, వాహనాల్లో 50 వేల కంటే పైబడి డబ్బులు తీసుకువెళ్తే తప్పనిసరి ఆధారాలు చూపాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ ఆధారాలు లేకుంటే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. తనిఖీల్లో భాగంగా వాహనాల్లోని పార్సెల్, లగేజీలను చెక్ చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా మద్యం డబ్బులు ఎన్నికల తైలాలని అక్రమంగా తరలించడానికి కట్టడి చేయడమే లక్ష్యంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వాహనాల్లో 50 వేల రూపాయలు మాత్రమే తీసుకెళ్లాలని, పైబడి ఉంటే సీట్ చేయడం ఆమె అన్నారు. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఉపాధి హామీ కూలీలు, బిజెపి నాయకులు



క్షీరాభిషేకం చేస్తున్న కూలీలు, బిజెపి నాయకులు

కుల్కచర్ల రూరల్, మేజర్ న్యూస్ (ఏప్రిల్ 10)ః కుల్కచర్ల మండలంలోని ఘనపూర్ గ్రామంలో ఉపాధి హామీ రోజువారి కూలీ 29 రూపాయలు పెంచి 300 రూపాయలు చేయడంతో బిజెపి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గణపురం వెంకటయ్య గౌడ్,జిల్లా కార్యవర్గ సభ్యులు మహిపాల్ ముదిరాజ్,మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ సర్పంచ్ సౌమ్య వెంకటరామిరెడ్డి,ఘనపూర్ మాజీ సర్పంచ్ విజయలక్ష్మి వేణుగోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆదర్శవంతమైన పాలన అందిస్తు పలు సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారు. ప్రజలకు ఉచిత రేషన్ బియ్యం, ఉజ్వల యోజన కింద ఉచిత సిలిండర్, ప్రధానమంత్రి కిసాన్ సమ్మన్ నిధి కింద ప్రతి సంవత్సరం 6000 రూపాయలు,వీధి దీపాలు, చెత్త సేకరణ గ్రామంలో,సి సి రోడ్లు, రైతు వేదిక, నర్సరీ లో మొక్కల పెంపకం, స్మశానాక వాటికా, డంపింగ్ యార్డ్, కరోనా వాక్సిన్, రైతులకు ఎరువులపై సబ్సిడీ, సుకన్య సమృద్ధి యోజనా తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తు,పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు అని దిన దిన అభివృద్ధి చేస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో మన ప్రధాని నరేంద్ర మోడీ నడిపిస్తున్నారని తెలిపారు.మన తెలంగాణ, మన ప్రాంతం బాగుపడాలి అంటే చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు సిపిరి శ్రీనివాస్,కొండ మాధవరెడ్డి ఫౌండేషన్ పరిగి ఇన్చార్జి రామచంద్రయ్య, హనుమంతు, దండు అంజయ్య, చీపిరి రాములు బిజారం లక్ష్మయ్య బుడ్డోల్ల వెంకటయ్య శేఖర్ గౌడ్ బూత్ సభ్యులు మరియు ఉపాధి హామీ మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు చేతి సంచుల పంపిణీ



చేతి సంచులు పంపిణీ చేస్తున్న బిజెపి నాయకులు

కుల్కచర్ల రూరల్, మేజర్ న్యూస్ (ఏప్రిల్ 10)ః చౌడాపూర్ మండల పరిధిలోని అడవి వెంకటాపూర్, అనుబంధ గ్రామ పంచాయతీ పరిధిలోని పలు తండాల్లో ఉపాధి హామీ కూలీలకు చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సహకారంతో వచ్చిన చేతి సంచులను వికారాబాద్ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు గోవింద్ నాయక్ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఉపాధి హమీ కూలీలకు ఏప్రిల్ 01నుండి రోజువారి వేతనాన్ని 3వందలకు పెంచి అందించడం జరుగుతుందని తెలిపారు.రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## పాలమూర్ ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి గెలుపు కోసం కలిసికట్టుగా పని చేద్దాం

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.కృష్ణంరాజు



కొడంగల్, మేజర్ న్యూస్ (ఏప్రిల్ 10): పాలమూర్ ఎంపీ అభ్యర్థి వంశీచందర్ రెడ్డి గెలుపు కోసం యూత్ కాంగ్రెస్ నాయకులు కలిసికట్టుగా పని చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.కృష్ణంరాజు పిలుపునిచ్చారు. గురువారం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో యూత్ కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు యూత్ కాంగ్రెస్ నాయకులు క్రీయాశీలక పాత్ర పోషించారన్నారు. అదే విధంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం పాలమూర్ ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు సైనికుల్లా పని చేద్దామన్నారు. ఇటీవలే తుక్కుగూడలో జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ అగ్రనేతలు ప్రకటించిన పాంచ్ న్యాయసూత్ర గ్యారం టీలపై ప్రజలకు వివరిస్తూ అభ్యర్థుల గెలుపు కోసం పని చేద్దామన్నారు. యూత్ కాంగ్రెస్ సభ్యత్వ నమోదుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని, సభ్యత్వ నమోదులో కొడంగల్ నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేద్దామన్నారు. అత్యధిక సభ్యత్వాలు చేయించిన వారికి కేంద్ర నాయకత్వంతో సన్మానాలు చేయించడం జరుగుతుందని తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వాలు చేయించిన యువజన కాంగ్రెస్ నాయకుడికి తన వంతుగా రూ.1లక్ష విలువ గల ద్విచక్రవాహనాన్ని అందిస్తానని తెలిపారు. ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డికి కొడంగల్ నియోజకవర్గం నుంచి 50వేల మెజారిటీని అందించేందుకు యూత్ కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ నియో జకవర్గ ప్రధాన కార్యదర్శి బంటు రాజగోపాల్, రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, మహిపాల్, నర్సిములు, భీమరాజ్, సందీప్, రవికుమార్, ప్రకాశ్‌రాజ్, బస్వరాజ్, మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల పార్లమెంట్‌లో బిజెపి గెలుపు ఖాయం

- దేశం కోసం ధర్మం కోసం బిజెపి
- ప్రపంచంలోనే అతి శక్తివంతమైన నాయకుడు ప్రధాని మోడీ
- కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర అభివృద్ధి
- మచ్చలేని నాయకుడు చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి
- కొండా విశ్వేశ్వర్ రెడ్డి
- అన్ని వర్గాల ప్రజలు బిజెపికే మద్దతు
- మేడ్చల్ అర్బన్ జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు చెన్నమనేని స్రవంతి



హైదరాబాద్, మేజర్ న్యూస్: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని మేడ్చల్ అర్బన్ జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు చెన్నమనేని స్రవంతి ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అతి శకవంతమైన నాయకుడు దే భారత ప్రధాని కావడం దేశ ప్రజల చేసుకున్న అదృ్‌ాఎష్టం అని అన్నారు. మోడీ మచ్చలేని నాయకుడని కొనియాడారు. చేవెళ్ల నియోజకవర్గం లో సైతం బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రజల కోసం సేవలందించే నాయకుడని కొనియాడారు. ఐదు దశాబ్దాల పాటు దేశాన్ని కాంగ్రెస్ పాలించిందని స్వతంత్ర్యాన్ని తెచ్చిన పార్టీగా, రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీ అని ప్రచారం చేసుకొని అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు ఎన్నికల్లో గెలవడం కోసం జిల్లాల వారీగా డిక్లరేషన్లు ప్రకటించి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇప్పుడు చేస్తుంది ఏమిటని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీగా కేసీఆర్ ను కాంగ్రెస్ ప్రశ్నించి కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేశారని విమర్శించారని కార్పొరేషన్లు పెట్టి, తప్పుడు జి ఎస్ డి బి ప్రకటించి ఎఫ్ ఆర్ బి ఎం పెంచుకున్నారని కాంగ్రెస్ నేతలు చెప్పింది నిజం కాదా అని ప్రశ్నించారు.కాంగ్రెస్ ఇచ్చే హామీలు అమలవుతాయో లేదో అన్న సోయి ఉండాలి కదా అని. సోయి ఉండి, ఎన్ని అబద్ధాలైనా చెప్పి, అవగాహన ఉండి హామీలిచ్చారన్నది కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలన్నారు. అధికారం లేని నాడు ఒకమాట, ఉన్ననాడు మరో మాట కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారున్నారు. తెలంగాణ రైతుల్లారా 2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. రుణమాఫీ దేవుడెరుగు పాత బకాయి కేసీఆర్ చెప్పిన లక్ష రూపాయల మాఫీ కూడా రింగ్ రోడ్డు అమ్మినడబ్బులు వడ్డీకి సరిపోయాయి కానీ అసలు ఇంత వరకు తీరలేదన్నారు. వెంటనే రెండు లక్షల రూపాయల రుణాలు తెచ్చుకోవాలని రేవంత్ చెప్పారని అన్ని చానలళ్ళల్లో వీడియో ఫుటేజ్ ఉందన్నారు కేసీఆర్ ఎంతిస్తే అంతకంటే ఎక్కువ ఇస్తానని హామీలిచ్చారు. పదవిలోకి రావాలనా ఆశ తప్ప ప్రజల సమస్య తీర్చాలన్న తపన బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలకు ఏ ఒక్కరికి లేదన్నారు. దేశంలో మూడోసారి నరేంద్ర మోడీ ప్రధాని కావడం, చేవెళ్ల నియోజకవర్గం లో ఎంపీగా హోండా విశ్వేశ్వర్ రెడ్డి గెలుపొందడం ఖాయమని చందమనేని స్రవంతి ధీమా వ్యక్తం చేశారు.

# మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

**మహాత్మా జ్యోతి బా పూలే విగ్రహాన్ని అసెంబ్లీ అవరణంలో ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి: బొల్ల శివశంకర్**



హైదరాబాద్, మేజర్ న్యూస్: మహాత్మ జ్యోతిబావూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలన్న డిమాండ్ చాలా రోజుల నుంచి (్ప జా బా ్హ ు ల్యం కోరుకుంటునందున రేవు వూలే జయంతి కార్యక్రమం సందర్భంగా ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని స్పష్టమైన ప్రకటన చేయాలని యునైటెడ్ వూలే ఫ్రెంట్ కో కన్వీనర్ బొల్లా శివశంకర్ కోరారు మహాత్మా జ్యోతిబా వూలే బడుగు బలహీన వర్గాల కోసం తన జీవితాన్నే పణంగా పెట్టి, అట్టి సమాజం చదువుకుంటేనే వారికి రావలసిన హక్కులను పొందగలరనే ఆలోచనతో చదువు ద్వారానే బడుగుల, బలహీన వర్గాల జీవితాలలో మార్పు సాధ్యం అవుతుందని దానికోసమే తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు నమ్మిన ఆశయం కోసం తన భార్యను తీసుకొని వూణే నగరం తో పాటు వివిధ ప్రాంతాల్లో పాఠశాలలు ఏర్పాటు చేసి సూర్యులకు విద్య ఏంటని అవహేళన చేసిన బ్రాహ్మణిక సమాజాన్ని ఎన్నో కష్టనష్టాలకు వచ్చి విద్య నేర్పిన గురువు అని కొనియాడారు కేవలం చదువుతోనే సమాజంలో స్వేచ్ఛ, సమానత్వం తోపాటు, ప్రశ్నించే తత్వాన్ని పెంచుకుంటారని మహిళలకు విద్య నేర్పారు 18వ శతాబ్దంలో బాల్యవివాహాలు సతీసహగమనం వంటి దురాచారాలకు వ్యతిరేకంగా అనేకపోరాటాలునిర్వహించారు వితంతువులకు వునర్వివాహాలు ప్రోత్సహిస్తూ వారి జీవితాలలో నూతన ఆనందాలు వెళ్ళు విరిసేలా చేశారు ఆనాటి సమాజంలో శూద్రులకు చదివిందుకని బ్రాహ్మణ సమాజంని వ్యతిరేకిస్తూ తన భార్యకు చదువు నేర్పించి ఆమె ద్వారా ఆనాటి సమాజంలోని స్త్రీలకు విద్య నేర్పించిన మహనీయుడు అన్నారు మహనీయుడు సమ సమాజ నిర్మాణం కోసం పాటుపడిన మహాత్మా జ్యోతి రావ్ వూలే అలాంటి మహనీయుడి విగ్రహాన్ని తెలంగాణ అసెంబ్లీలో ఏర్పాటు చెయ్యాలని మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కవిత సారథ్యంలోని యునైటెడ్ వూలే ఫ్రంట్ పలు విజ్ఞాపనలు ఇస్తూ ప్రభుత్వాన్ని పలు దఫాలుగా డిమాండ్ చేసిందన్నారు అయినా రాష్ట ప్రభుత్వం వూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణంలో ఏర్పాటు చేయాలని ఆలోచన స్పష్టం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా రాష్ట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలి రేవు అనగా ఏప్రిల్ 11.న మహాత్మ జ్యోతి రావ్ వూలే జయంతిని పురస్కరించుకొని అసెంబ్లీ ఆవరణలో వూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పైన స్పష్టమైన ప్రకటన చెయ్యాలని వూలే యునైటెడ్ ఫ్రంట్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. రాష్ట జనాభాలో 50 శాతం పైగా ఉన్న బీసీలను కనీస గౌరవం లేదని , అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాటం చేసిన మహనీయుని విగ్రహాన్ని ఈ ప్రభుత్వం అసెంబ్లీలో ఎర్పాటు చేయకుండ బడుగు బలహీన వర్గాల మనోభావాలను లెక్కలోకి తీసుకోకపోవడం అక్షయపనీయమన్నారు ఈ ప్రభుత్వానికి బిసిలు అంటే చులకనగా ఉందని దానికి ఉదాహరణ కులగణన చేయించి బిసి జనాభా ప్రాతిపదికన వారికి రావాల్సిన నిధులు, రాజకీయ వాటా ఇస్తామని చెప్పి ఎన్నికలలో ఓట్లు దండుకుని అధికారంలోని వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు బిసిలను మోసం చేస్తుందని, పార్లమెంటు ఎన్నికలను దృ్‌ాఎష్టిలో పెట్టుకుని కుల గణన చేపడుతాం అని ప్రకటన చేసినారు. అసెంబ్లీలో వూలే విగ్రహాన్ని ఏర్పాటు చెయ్యలేని ఈ ప్రభుత్వం బిసిల అభివృ్‌ాఎద్ధి కోసం ఏదో చేస్తామని చెబితే నమ్మడానికి బిసిలు సిద్ధంగా లేరు రేవు జరిగే వూలే జయంతి సందర్భంగా రాష్ట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనీసం ఈ విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వకపోతే ఇప్పుడు జరిగే పార్లమెంటు ఎన్నికలలో బిసిలు అధికార పార్టీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

## లంగర్‌హౌజ్‌లోని సంగం దేవాలయంలోని శ్రీరామచంద్రజీ మఠ్‌లో ప్రారంభం అయిన శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు

సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః లంగర్‌హౌజ్ సంగం దేవాలయంలోని శ్రీరామ చంద్రజీ మఠ్‌లో బుధవారం రాత్రి శ్రీరామ నవమి బ్రహోత్సవాలు అంగరంగ వైభవంగా మఠాధిశులు శ్రీమహంత్ రాహుల్‌దాస్ బాబా స్వామిజీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభం అయ్యాయి. బ్రాహ్మణ వేద పండితుల వేద మంత్రాలమధ్య ఘనంగా శ్రీరాములవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యారు. ఈ సందర్భంగా మఠాధిపతి రాహుల్‌దాస్ మహరాజ్ మాట్లాడుతూ ఈనెల 9వ తేదినుంచి ఈనెల 18వ తేదివరకు సంగం దేవాలయం మఠంలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలను ప్రతి ఏటా మాదిరిగాను ఈసారికూడ భారీ ఏత్తున నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈనెల 13వ తేదిన సాయంత్రం 6.00 గంటలకు శ్రీ శ్రీనివాసుల కళ్యాణం,ఈనెల 14వ తేదిన సాయంత్రం 6.00 గంటలకు శ్రీలక్ష్మి నర్సింహ్మస్వామివారి కళ్యాణం, ఈనెల 17వ తేదిన ఉదయం 10.00 గంటలకు శ్రీసీతారాముల కళ్యాణం వేడుకలను కనివిని ఏరుగనిరీతిలో నిర్వహించేందుకు భారీగా సన్నాహాలు,ఏర్పాట్లను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 18వ తేదిన చక్ర స్నానం కార్యక్రమంలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని,ఈ వేడుకల్లో పెద్ద ఏత్తున భక్తులు తరలివచ్చి,స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. ప్రారంభ పూజ కార్యక్రమంలో చుడిబజార్‌లోని శ్రీజగన్నాథ్ మఠాధిపతి శ్రీ బాలయోగి బ్రహ్మశ్రీ అమృత్‌దాస్ మహరాజ్ ఖాకీకూడ ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## హైదరాబాద్ పాత నగరంలో మజ్లీస్ ఆగడాలు,దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేయాలంటే బిజెపికే పట్టంకట్టండి

**-కె. మాధవిలత**



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో మజ్లీస్ పార్టీ ఆగడాలు,ధౌర్జన్యాలు పెచ్చరిల్లిపోతున్నాయని,రాబోవు ఏన్నికల్లో మజ్లీస్ పార్టీని ఓడించేందుకు పార్టీ కార్యకర్తలందరు ఇప్పటినుంచే వీర సైనికులుగా పనిచేసి,భాగ్యనగర్‌లో కషాయం జెండాను ఏగురవేసి,బి.జె.పి. పార్టీ సత్తాను చాటిచెబుతామని బి.జె.పి. హైదరాబాద్ నియోజకవర్గం లోక్‌సభ అభ్యర్థి కె. మాధవి లత పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం నాంపల్లి ఏగ్జిబిషన్ గ్రౌండ్‌లో హైదరాబాద్ లోక్‌సభ పార్టీ కార్యకర్తల సన్నాహాక ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కె. మాధవి లత మాట్లాడుతూ ప్రతి సారి జరిగే లోక్‌సభ ఏన్నికల్లో మజ్లీస్ పార్టీ అక్రమ మార్గంలో భారీగా పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగుకు పాల్పడి,ఏన్నికల్లో గెలుస్తుందని,నీతి నిజాయితీగా ఏన్నికల్లో పోటీచేస్తే,మజ్లీస్ పార్టీ ఓటమి పాలుకావడం ఖాయమన్నారు. హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో తమ పార్టీ కార్యకర్తలు,నేతలే తనకు కొండంత బలమని,వారి బలంతో తాను నియోజకవర్గంలో ఏన్నికల ప్రచారం నిర్వహించి,కుల,మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలనుకల్సి,వారి సాధక,బాధలను అడిగితెలుసుకుంటున్నట్లు ఆమె చెప్పారు. మైనార్టీ మహిళలకు తమ పార్టీ ఆనేక పథకాలను అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. కేంద్ర ఏన్నికల కమీషన్ ధర్మబద్ధంగా,న్యాయబద్ధంగా పాత నగరంలో ఏన్నికలు నిర్వహించేదిశగా తగిన విధులను నిర్వహించాలన్నారు. అన్యాయాలు,అక్రమాలు,మోసాలు,ధౌర్జన్యాలు ఏక్కువ కాలం నడవదని,ఇప్పటివరకు పాతనగరంలో మజ్లీస్ పార్టీ పాత నగర ప్రజల జీవితాలతో చెలగాటం ఆడి,మతాన్ని అడ్డుపెట్టుకుని,ఏన్నికల్లో గెలుస్తుందని ఆమె విమర్శించారు. తమ పార్టీ అన్ని వర్గాల ప్రజల పండుగల్లో ప్రజలను కలుస్తుందని, మజ్లీస్ పార్టీ హిందూవుల పండుగల్లో కలువడానికి పక్షపాతం చూపుతారని ఆమె గుర్తు చేశారు. ఈసారి జరిగే హైదరాబాద్ లోక్‌సభ ఏన్నికల్లో 40సంవత్సరాల చరిత్రను తిరిగరాజేందుకు బి.జె.పి. కంకణం కట్టుకుందని ఆమె జోస్యం పలికారు. కాంగ్రెస్ పార్టీ రజాకార్లతోకల్సి వారికి మద్దతు ఇస్తుందని,అందుకే బి.ఆర్.ఎస్.ను వదిలిపెట్టి, మజ్లీస్ పార్టీ కాంగ్రెస్‌తో జతకలిపి,తిరిగి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమైందని ఆమె విమర్శించారు. ఈసారి జరిగే లోక్‌సభ ఏన్నికల్లో హైదరాబాద్ పార్లమెంట్ ఏన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే, పాత నగరాన్ని బంజారహిల్స్,జూబ్లీహిల్స్‌లాగా అభివృద్ధి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ సన్నాహాక సమ్మేళనం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఏమ్మెల్సీ ఎస్. రామచంద్రరావు,బి.జె.పి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వేంకటేశ్వర్లు, పార్లమెంటరి ప్రభారి అట్లూరి రామకృష్ణ, గోల్కొండ జిల్లా అద్యక్షులు వి. పాండు యాదవ్,భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు సంరెడ్డి సురేందర్‌రెడ్డి,అల్వాల ఇంద్రసేనారెడ్డితోపాటు పలువురు పార్లమెంట్ కన్వీనర్లు పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు,బూత్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన అధికారులు

- సీసీ కెమెరాలు ఏర్పాటు, కట్టుదిట్టమైన భద్రత
- సహాయ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రావు వెల్లడి

తాండూరు మేజర్ న్యూస్ (ఏప్రిల్ 10): తాండూరు పట్టణంలోని సెయింట్ మర్క్స్ పాఠశాలలో భద్రపరిచిన ఈవిఎంల స్ట్రాంగ్ రూంలను అధికారులు బుధవారం నాడు పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈవిఎంలు సెయింట్ మర్క్స్ పాఠశాలలో గలా స్ట్రాంగ్ రూమ్‌ల యందు భద్రపరిచిన విషయం తెలిసిందే. ఇందుకుగాను పారా మిలిటరీ బృందం, పోలీసులతో కుడి ఈవిఎంల రక్షణ కోసం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తు తోపాటు అవసరమైనన్ని మేరకు సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. ఇందుకుగాను వన్ ప్లస్ ఫోర్ పారా మిలిటరీ బృందం రక్షణ కల్పిస్తుందని సహాయ రిటర్నింగ్ అధికారి (56 తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్) ఎం.శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. మే 13న నిర్వహించ బోయే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



స్ట్రాంగ్ రూమ్ లను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్ రావు

ఇందులో భాగంగానే స్ట్రాంగ్ రూమ్ లను సందర్శించి పరిశీలించడం జరిగిందని ఆయన అన్నారు. ఆర్డీఓ వెంట తాండూరు తహసీల్దార్ తారాసింగ్,రెవెన్యూ శాఖకు చెందిన అధికారి విజయేందర్,తదితరులు ఉన్నారు.

# ముస్లీంల పవిత్ర మాసం రంజాన్

## పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి



మేడిపల్లి మేజర్ న్యూస్ (ఏప్రిల్ 10): ముస్లిం సోదరులకు అత్యంత పవిత్ర మాసం రంజాన్ అని పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి అన్నారు. ఈ మేరకు రంజాన్ పర్వదినం (ఈద్ ఉల్ ఫితర్) సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముస్లిం సోదరసోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు.పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలతో పాటు ఈ మాసంలో క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, దాతృత్వం, ప్రేమ ,క్షమ, దయ, ఉపకారం, సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. పవిత్ర ఖురాన్ అవతరించిన మాసంలో ముస్లింలు ఉపవాసాలు ఉంటూ ఆధ్యాత్మిక చింతనతో ప్రత్యేక ప్రార్థనలు, దానధర్మాలు చేస్తుంటారన్నారు. తెలంగాణ సమాజం గంగా, జామునా తహజీబ్ మత సామరస్యానికి ప్రతీక అన్నారు. ముస్లింలు తమ ఉపవాస దీక్షలు విరమించి భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి రంజాన్ పర్వదినాన్ని జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# మహేశ్వరి కాలనీలో సత్వరమే తాగు నీరు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి

## – జిల్లా పరిషత్ సిఈఓ దిలీప్ కుమార్

ఘట్‌కేసర్ రూరల్, మేజర్‌న్యూస్(ఏప్రిల్ 10) : ఘట్‌కేసర్ మండలం కాచవాని సింగారం గ్రామం మహేశ్వరి కాలనీలో ప్రజల తాగునీటి సమస్యను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆటు జలమండలి అధికారులను ఇటు పంచాయతీ అధికారులను గ్రామ ప్రత్యేక అధికారి, జిల్లా పరిషత్ సిఈఓ దిలీప్ కుమార్ బుధవారం ఆదేశించారు. మహేశ్వరి కాలనీలో ప్రజలు తీవ్ర నీటిఎద్దడి ఎదుర్కోవడంపై అందుతున్న పిర్యాదులతో జిల్లా పంచాయతీ అధికారి వెంకటయ్య, ఎంపీడీఓ గీతారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ కొంతం వెంకట్‌రెడ్డితో కలసి కాలనీలో పర్యటించి తాగునీటి సమస్యలతో పాటు అక్కడ ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండే జలమండలి ఉన్నత అధికారులతో ఫోన్లో మాట్లాడి ఈ రోజు సయంత్రం వరకు కాలనీ ప్రజలకు తాగు నీరు అందించాలని ఆదేశించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యలయంలో అధికారులతో సమస్యలపై సమిక్ష నిర్వహించారు. వీధి లైట్లు పోయిన చోట తిరిగి ఏర్పాటు చేయించాలని, ఈ రోజు సాయంత్రం వరకు



మహేశ్వరి కాలనీలో పర్యటిస్తున్న జిల్లా పరిషత్ సిఈఓ దిలీప్ కుమార్.

కాలనీకి తాగు నీరు అందించే విధంగా జలమండలి అధికారులను సమన్వయం చేసుకొని పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ గీతా రెడ్డిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లారెడ్డి, అంకుషాపూర్ పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి, బిల్ కలెక్టర్లు సుదర్శన్ రెడ్డి, విష్ణు, శ్రీకాంత్, స్థానిక కాలనీ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ధారూర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షునిగా పట్లొల్ల శ్రీకాంత్ రెడ్డి



శ్రీకాంత్ రెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

ధారూర్, మేజర్ న్యూస్ (ఏప్రిల్ 10): మంగళవారం వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సమక్షంలో ధారూర్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షునిగా ఎబ్బనూర్ గ్రామ మాజీ సర్పంచ్,ధారూర్ మండలం సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి ని నియమించారు. ఈ కార్యక్రమం లో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి,పిఏసిఎస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, సీనియర్ నాయకుడు రాజేందర్ రెడ్డి,రవీందర్ రెడ్డి, వెంకటయ్య, బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాజు గుప్తా,కావలి అంజయ్య,మాజీ సర్పంచ్‌లు అంజయ్య,చంద్రమౌళి,బాలు నాయక్,హఫీజ్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంత యువకులు క్రీడల్లో రాణించాలి

కుల్కచర్ల రూరల్, మేజర్ న్యూస్ (ఏప్రిల్ 10): గ్రామీణ ప్రాంత యువకులు క్రీడల్లో రాణించాలని బిజెపి నాయకుడు వార్ల ఆంజనేయులు, పిఎన్ పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ అన్నారు. కుల్కచర్ల మండల పరిధిలోని ఘణపూర్ గ్రామ పంచాయతీలో ఉగాది ఉత్సవాల్లో భాగంగా గ్రామ స్థాయిలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గోప్యా నాయక్ తండా వాసులు ప్రథమ బహుమతి,సుభ్యా నాయక్ తండా వాసులు ద్వితీయ బహుమతి పొందడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గెలుపోటములు సమానంగా తీసుకోవాలని పండుగ వాతావరణంలో గ్రామానికి చెందిన యువత పెద్దలు ఒకే దగ్గర చేరి ఉల్లాసంగా ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనడం, క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించేందుకు సిఎ వెంకటయ్య, గౌడ్,చీపిరి రాములు, రఘు గౌడ్, హైదరాబాద్ విజయ్ కుమార్ సుధాకర్ గౌడ్ తదితరులు ముందుకు రావడం



సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఫౌండేషన్ కోఆర్డినేటర్ రాంచంద్రయ్య, క్రీడాకారులు గణేష్, సంతోష్, శ్రీకాంత్, నరేష్, శివ, రాజశేఖర్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు



.హుండీ లేకిస్తున్న ఆలయ నిర్వాహకులు

కుల్కచర్ల రూరల్, మేజర్ న్యూస్ (ఏప్రిల్ 10): కుల్కచర్ల మండలం పరిధిలోని బండవెల్కిచర్ల శివారులోని కొలువైన పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి ఉగాది బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం హుండీ లెక్కింపు చేయగా 5,82,701 రూపాయలు భక్తులు కానుకలుగా హుండీలో వచ్చినట్లు కార్యనిర్వహక అధికారి సుధాకర్, ఆలయ చైర్మన్ రాములు తెలిపారు. అదేవిధంగా రెండు కోడెలు వేలం వేయగా ఒకటి బైండ్ల అనంతయ్య 15వేల రూపాయలకు రెండవ కోడె కాశముని మల్లేష్ రూపాయలు 21వేల 500 రూపాయలకు దక్కించుకున్నాట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో పర్యవేక్షకులు శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం కుషాయిగూడ.కమిటీ సభ్యులు, దేవాలయం అర్చకులు పాండు శర్మ, దశరథం, శ్రీ సాంబశివాణి సేవ సంస్థ భక్తులు, వివిధ గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాలి విజయ్ కుమార్ రెడ్డి.



మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షులు మాలి. విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం దోమ మండల కేంద్రంలోని మజీద్ ఆవరణలో కాంగ్రె స్ పార్టీ యువ నాయకులు కే.చక్రధర్ రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దోమ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాలి.విజయ్ కుమార్ రెడ్డి హాజర య్యారు.ఈ సందర్భంగా సోదర భావానికి ఇఫ్తార్ విందులు ప్రత్యేకంగా నిలుస్తాయని అన్నారు. ముస్లింలు రంజాన్ మాసాన్ని ఎంతో పవిత్ర



దినంగా పాటిస్తారని తెలిపారు. కుల మతాలకు అతీతంగా నడుచుకున్నప్పుడే శాంతి భద్రతలో మార్పు వస్తుందని అన్నారు. సర్వ మతాలకు వేదిక మన దేశం లౌకిక రాజ్య దేశామని పేర్కొన్నారు. ముస్లింల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో మండల కో అప్షన్ సభ్యులు ఖాజాపాషా, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మాలి విజయ్ కుమార్ రెడ్డి, నాయకులు బంగ్లా యాదయ్య గౌడ్,ఖమ్మర్ పాషా,రమేష్ గౌడ్, బస్వారాజ్, గౌస్,జావీద్,మైను,రుక్మదిన్, యాదయ్య గౌడ్, సాజిద్,ముస్లిం పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి భారీ మెజారిటీతో గెలిపించుకుందాం

- వికారాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం

వికారాబాద్,మేజర్ న్యూస్(ఏప్రిల్ 10)ః చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి డా.గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని వికారాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా డా.గడ్డం రంజిత్ రెడ్డిని మన కాంగ్రెస్ పార్టీ అదిష్టానం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించి వారిని చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం జరిగిందని ప్రకటనలో పేర్కొన్నారు.మనమందరం కాంగ్రెస్ పార్టీ నియామాలకు కట్టుబడి అధిష్టానం నిర్ణయాన్ని గౌరవించి అభ్యర్థితో సంబంధం లేకుండా పార్టీ గెలుపు కొరకై ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన బాధ్యత మనపై ఉందని ఆ ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియా వేదిక ద్వారా కొంతమంది పనిగట్టుకుని కాంగ్రెస్ పార్టీని ఇబ్బంది పెట్టే పనులు చేస్తున్నారని ప్రకటనలో పేర్కొన్నారు.మీకు ఏమైనా ఇబ్బందులు ఉంటే మీ మండల పార్టీ అధ్యక్షున్ని గాని, సీనియర్ నాయకులకు గాని, లేదా నేరుగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం.ప్రసాద్ కుమార్‌కు మీ సమస్యలను తెలియజేసే అవకాశం ఉందని తెలిపారు.మన నాయకుడు గడ్డం ప్రసాద్ కుమార్ ఏ బాధ్యత అప్పజెప్పిన మనం దాన్ని పూర్తి చేయవలసిన బాధ్యత మనపై ఉందని ప్రకటనలో చెప్పారు.కాబట్టి సోషల్ మీడియాలో పార్టీ గురించి గాని, అభ్యర్థికి సంబంధించిన ఎలాంటి వ్యతిరేక పోస్టింగ్లు పెట్టిన పార్టీపరంగా వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## జిల్లాలోని ముస్లీం సోదర,సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు

- జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (ఏప్రిల్10)ః జిల్లాలోని ముస్లీం సోదర, సోదరీమణులకు రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు.రంజాన్ పండుగను ముస్లీం సోదర, సోదరీమణులలు సుఖసంతోషలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## వృత్తి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానంః బలరామారావు



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (ఏప్రిల్ 10)ః మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం దేవరయాంజాల్ లోని ఎస్సీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ భవనంలో నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలోకి 13వ బ్యాచ్ అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బలరామారావు తెలిపారు. బుధవారం ఆయన ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, ఇందులో, టైలరింగ్, కంప్యూటర్, బ్యూటీషన్, మొబైల్ సర్వీసింగ్, డొమెస్టిక్ ఎలక్ట్రీషియన్, సోలార్ టెక్నీషియన్, సి.సి.కెమెరా ఇన్ స్టలేషన్, రిపేరింగ్ మొదలైన ట్రేడ్ లలో శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు తగిన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని బల రామారావు సూచించారు. ఇతర వివరాల కోసం సెల్ నెంబరు :7989405049, 9290217274 లకు సంప్రదించవచ్చు.

## రైల్వే, బస్ స్టేషన్లను తనిఖీ చేసిన బాంబు స్క్వాడ్



వికారాబద్, మేజర్‌న్యూస్ (ఎప్రిల్ 10)ః వికారాబాద్ జిల్లా ఎస్పి కోటిరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం బాంబు స్క్వాడ్ టీం అధికారులు జిల్లా కేంద్రంలోని బస్ స్టాండ్, రైల్వే స్టేషన్లలో తనిఖీలు నిర్వహించారు.

## ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పి ఎన్.కోటిరెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం.

తాండూరు రూరల్, మేజర్‌న్యూస్ (ఎప్రిల్ 10)ః మండల పరిధిలోని చెన్‌గేస్‌పూర్ గ్రామం పరిధిలోనిఈద్గా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ కోటిరెడ్డి మత పెద్దలతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ రంజాన్ పండగకు ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించుకునేందుకు వీలుగా ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.అల్లా దీవెనల వల్ల రంజాన్ పండుగను ఎంతో ఆహ్లాదకరంగా, సంతోషంగా జరుపుకోవాలని ఆయన ముస్లిం సోదరులను కోరారు. పండగ రోజు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. డి.ఎస్.పి బాలకృష్ణారెడ్డి రూరల్ సీఐ అశోక్ కుమార్, కరణ్ కోట్ ఎస్సై విటల్ రెడ్డి, ఈద్గా మత పెద్దలు యూసుఫ్ ఖాన్ ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## మరణించిన వ్యక్తిని గుర్తుపడితే పోలీసులకు సమాచారం అందించాలి

- కుల్కచర్ల ఎస్ఐ అన్వేష్ రెడ్డి



గుర్తు తెలియని వ్యక్తి మృతి

కుల్కచర్ల మేజర్ న్యూస్ (ఏప్రిల్10)ః మృతి చెందిన వ్యక్తిని గుర్తుపడితే పోలీసులకు సమాచారం అందించాలని కుల్కచర్ల ఎస్ఐ అన్వేష్ రెడ్డి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో ఆయన మాట్లాడుతూ మార్చి 21వ తేదీ హైబీపీతో కిందపడిపోగా అతన్ని గమనించిన పోలీసులు సిబ్బంది కుల్కచర్ల ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అనంతరం వైద్య సిబ్బంది పరిగికి, అనంతరం పరిగి నుండి తాండూర్ కు పంపించడం జరిగింది. చికిత్స పొందుతూ అతను మృతి చెందడం జరిగింది. అతన్ని ఎవరైనా గుర్తుపడితే పోలీసులకు సమాచారం అందించగలరని ఆయన తెలిపారు.

## జనగాం పాఠశాలలో చోరీ

- పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రధానోపాధ్యాయులు నర్సింలు



చోరీ అయిన రూమ్‌ను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దెముల్, మేజర్‌న్యూస్ (ఎప్రిల్ 10)ః పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తులు చోరికి పాల్పడి, పాఠశాలలో ఉన్న ఆట వస్తువులను ఎత్తుకెళ్లారు. పోలీసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింలు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని జనగాం ఎంపీ యుపిఎస్ పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల గది తాళాలు పగలగొట్టి,చోరీకి పాల్పడి సుమారు పదివేల ఆట వస్తువులను దొంగతనం చేసినట్లు తెలిపారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.పాఠశాల ఆవరణలో కొంతమంది మద్యం సేవించి మందు బాటిల్ పగలగొడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గిరి తెలిపారు.



పాఠశాల

## మాజీ మంత్రి మల్లారెడ్డికి ఉగాది శుభాకాంక్షలు తెలిపిన కౌడే మహేష్

### మాజీ మంత్రి మల్లారెడ్డిని కలిసిన కౌన్సిలర్లు



మేడ్చల్, మేజర్ న్యూస్ (ఏప్రిల్ 10) : రాష్ట్ర మాజీ కార్మిక శాఖ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మల్కాజ్ గిరి నియోజకవర్గ శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డిలను మంగళవారం కౌన్సిలర్ కౌడే మహేష్ వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన శాలువాతో సత్కరించి శ్రీ క్రోధి నామ సంవత్సర తెలుగు నూతన సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్ష లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ పురపాలక సంఘం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చెర్వుకొమ్ము శేఖర్ గౌడ్, మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్లు అత్వెల్లి అర్చనసందీప్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు ఆకిటి నవీన్ రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు మెరుగు మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కాలంచెల్లిన బిస్కెట్స్, నూడిల్స్ విక్రయించిన వ్యక్తిపై కేసు నమోదు

- ఎస్ఐ అరవింద్





వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ అరవింద్

మోమిన్‌పేట్, మేజర్‌న్యూస్ (ఎప్రిల్ 10)ః కాలం చెల్లినటువంటి వస్తువులు అవ మ్ముత న్నార నే సమాచారంతో మండల కేంద్రంలోని దుకాణాలలో పోలీసులు తనిఖీలు నిర్వహించగా అంజయ్య కిరాణం షాపులో కాలం చెల్లినటువంటి బిస్కెట్స్ నూడిల్స్, టకాటక్ అనే చిప్స్ ప్యాకెట్స్ బయటపడ్డాయి. ఇలాంటి కాలం చెల్లిన వస్తువులను అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు మోమిన్ పేట్ ఎస్సై అరవింద్ తెలిపారు. ఇలాంటి వస్తువులను మరెక్కడైనా అమ్మిన నాసిరకమైనటువంటి వస్తువులను అమ్మిన ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని తెలిపారు. ఈ వస్తువులను తిన్న వ్యక్తులు రోగాల బారిన పడే అవకాశం ఉందని అందుకు ప్రతి ఒక్కరు చూసి అమ్మాలని తెలిపారు.